నెలకు రూ.70లక్షల భారం

- గృహ అవసరాల వంటగ్యాస్‌పై రూ.50పెంపు
- ఎనిమిది నెలల్లో రెండోసారి..
- ఇది వరకే సబ్సిడీ ఎత్తివేత



అచ్చంపేట: సామాన్య ప్రజానీకంపై గ్యాస్ సిలిండర్ బాదుడు ఎక్కువైంది. వంట గ్యాస్ సిలిండర్ ధర మళ్లీ భగ్గుమంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న ప్రజల నడ్డివిరిచేలా గ్యాస్ బండ గుదిబండగా మారింది. ప్రస్తుతం గృహ అవసరాల సిలిండర్ ధర మరో రూ.50 పెంచుతున్నట్లు ప్రకటించాయి. పెరిగిన ధరతో రూ.1,182కు చేరుకోగా.. జిల్లా ప్రజలపై నెలకు సుమారుగా రూ.75లక్షల అదనపు భారం పడుతుంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.350 పెరగడంతో వాణిజ్య వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 2,58,122 గ్యాస్ కనెక్షన్లు

గతేడాది జూలైలో వంట గ్యాస్ ధర పెంచిన కేంద్ర చమురు సంస్థలు తాజాగా ఈఏడాది ఆరంభంలోనే మరోసారి పెంచుతూ అమల్లోకి తీసుకొచ్చాయి. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల సిలిండర్‌పై రూ.50 అదనంగా బాదాయి. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 9లక్షల జనాభా, 2,28,456 కుటుంబాలు ఉండగా, 17 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 2,58,122 గ్యాస్ కనెక్షన్లు, 945 కమర్షియల్ సిలిండర్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ప్రతి నెల సుమారుగా 1.50లక్షల మంది లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులకు మాత్రం గ్యాస్ సిలిండర్‌పై రూ.246 సబ్సిడీ వస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 33,318 ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా గ్యాస్ కనెక్షన్ల వివరాలు

మొత్తం : 2,58,122	సింగిల్ సిలిండర్లు : 1,00,775
డబుల్ సిలిండర్లు : 45,735	
దీపం కనెక్షన్లు 61,010	సీఎస్ఆర్ : 17,284
పీఎంయూవై 33,318	కమర్షియల్ 945

సబ్సిడీ ఎత్తివేత

ఓవైపు వంట గ్యాస్ సిలిండర్ ధర పదేపదే పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు వాటిపై ఇస్తున్న సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసింది. కరోనాకు ముందు గ్యాస్ సిలిండర్ పొందిన వినియోగదారులు బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ నగదును జమ చేసేది. వైరస్ తగ్గుముఖం పట్టిన అనంతరం ఆర్థిక సంక్షోభం పేరిట ఆ సబ్సిడీలను పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం ఉజ్వలతో పాటు నామమాత్రంగా రూ.46 చొప్పున సబ్సిడీ విడుదల చేస్తుంది. అది కూడా తక్కువగా ఉండడంతో వినియోగదారులు సైతం దాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. కేంద్ర నిర్ణయంపై వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ధర వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



వంట గ్యాస్ ధర పెంపు మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారింది. ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50 పెంచడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి.
– ప్రేమలత, ఉప్పునుంతల

వెంటనే తగ్గించాలి



పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. చాలీచాలని జీతంతో ఇల్లు గడవడం కష్టమవుతుంది. ఇప్పటికే గ్యాస్ సబ్సిడీ ఎత్తివేసిన కేంద్రం తాజాగా మళ్లీ ధర పెంచడం సరికాదు. మాలాంటి సామాన్యులకు ఇది మోయలేని భారమే. వెంటనే పెంచిన ధర తగ్గించడంతో పాటు గతంలో మాదిరిగా సబ్సిడీ అందించాలి. – మీనాక్షి, అచ్చంపేట

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



కంటి అద్దాలు అందిస్తున్న ఎంపీపీ మనోహర

కల్వకుర్తిరూరల్: ప్రజల కంటి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మనోహర తెలిపారు. సోమవారం మండలంలోని జీడిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంధత్వాన్ని తొలగించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు శిబిరాలను ఏర్పాటు చేశారు. 701 మందికి పరీక్షలు నిర్వహించి 44 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరో 45 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంజయులు, ఉపసర్పంచ్ ఖాజా, వైద్య సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు మేలు



ప్రజలతో మాట్లాడుతున్న అభిలాష్‌రావు

పెంట్లవెల్లి: కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు మేలు కలిగిందని రంగినేని అభిలాష్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సింగవరంలో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో తిరుగుతూ పార్టీ పథకాలను, అధికారంలోకి వస్తే చేయబోయే వాటి గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచుతూ సామాన్య ప్రజలను నట్టేట ముంచుతున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి పార్టీ మారి చేసిందేమి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీరయ్య, శివకాశి, ఈశ్వరయ్య, గోపి పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పూడిక తీత పనుల్లో కూలీలు

తాడూరు: మండలంలోని తుమ్మలసూగూరు ఊర చెరువులో సోమవారం ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని పూడిక తీత పనులను ప్రారంభించారు. ఏపీఓ ప్రవీణ్ మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచే విధంగా పూడిక తీత పనులను ప్రారంభిస్తున్నామన్నారు. మరికొద్ది రోజుల్లో ఆయా గ్రామాలలోని చెరువుకుంటల్లో నీరు పూర్తిగా ఖాళీ అయితే వాటిలో పనులు చేపడుతామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తాడూరులో ప్రచారం చేస్తున్న తపస్ నాయకులు

కందనూలు: మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపిస్తే ఉపాధ్యాయ, ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారంతోపాటు విద్యా వ్యవస్థ మార్పు కోసం కృషి చేస్తానని బహుజన ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నత పాఠశాలలు, కళాశాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా తనను ఎన్నుకుంటే విద్యా వ్యవస్థలో ఏం మార్పు తీసుకురావాలో ఉపాధ్యాయుల సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో చట్టసభల్లో బీసీల ప్రాధాన్యత తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. తనకు పలు సంఘాలు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంపూర్ణ మద్దతు తెలిపారని అన్నారు. సమావేశంలో భాస్కర్, వెంకటయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వినయ్ బాబును గెలిపించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, కేజీవీబీ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు.

పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయులు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు సోమవారం ప్రచారం నిర్వహించారు. సాతాపూర్, కల్వకోల్, గంట్రావుపల్లి, పెద్దకార్పాముల, దేవల్‌తిరుమలాపూర్, ముష్టిపల్లి, వెన్నచర్ల, చంద్రకల్ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.

కొల్లాపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించాలని రంగినేని జగదీశ్వరుడు కోరారు. సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వాన్ని నిలదీసే నాయకుడని, శాసన మండలికి పంపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు.

తాడూరు: తపస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బలాన్‌పల్లి, ఐతోల్, మేడిపూర్, తాడూరు ప్రభుత్వ కళాశాలలో నాయకులు ప్రచారం సాగించారు. ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తేనే సమస్యలు పరిష్కరించబడుతాయన్నారు. ప్రతిపక్షం తప్పనిసరి ఉండాలన్నారు. కార్యక్రమంలో కట్టా శ్రీనివాస్‌రెడ్డి, బిచ్చారావు, హరికృష్ణ, రాజశేఖర్ రావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ధర్నాకు తరలిరండి

కల్వకుర్తి: ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడంతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడంపై బుధవారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వెల్దండ: పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి పేదప్రజలపై భారం వేస్తుందని, అందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 8న ధర్నా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

చదువుకుంటేనే జీవితంలో ఎదుగుదల



కల్వకుర్తి: చదువుకుంటేనే జీవితంలో ఎదుగుదల సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ చేశారు. కమిషనర్ అస్రత్ కుమార్, ఆనంద్‌గౌడ్ జనార్దన్‌రెడ్డి, శ్రీశైలం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. మండలంలోని జూపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శోభన్ బాబు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శారదమ్మ, ఉపసర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



లింగాల మండలం అంబట్‌పల్లిలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

పలు పాఠశాలలలో సోమవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లింగాల మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో, శాయిన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో, తాడూరు మండలంలోని మేడిపూర్, బలాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో, పెద్దకొత్తపల్లి మండలం కొత్తయాపట్ల ప్రాథమిక పాఠశాలలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాడూరులో ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఎండిన పత్తి, ఇతర పంట కర్రలను తొలగించండి



పొలంలో వదిలేసిన పత్తి కర్రలను పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: వానాకాలంలో సాగు చేసిన పత్తి పంట చేతికి వచ్చిన తర్వాత నిరుపయోగంగా వదిలేసిన పత్తి కర్రలు, మోళ్లను తొలగించకపోతే భూమికి నష్టం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గ్రామాల్లో పర్యటించిన ఆయన యాసంగి పంటలను పరిశీలించారు. ఇదే సమయంలో పత్తిని తొలగించిన పొలాలను చూశారు. మండలంలో వానాకాలంలో 6,500 ఎకరాలలో పత్తి సాగు చేశారని, పత్తి తీసిన తర్వాత కర్రలు, మోళ్లను అలాగే పొలంలో ఉంచడం వలన నష్టం కలుగుతుందని రైతులకు వివరించారు. ఎండిన పత్తి కర్రల వలన ఎండలకు భూమిలో ఉండే తేమతో పాటు పోషకాలు ఆవిరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గులాబీ రంగు పురుగు కోశస్థ దశలో కర్రల మీదనే ఉందని తెలిపారు. దీని వలన వచ్చే సీజన్‌లో సాగు చేసే పంటలకు తెగులు సోకే అవకాశాలు లేకపోలేదని అవగాహన కల్పించారు. పంట పొల్లాలో ఎండిన పత్తి ఇతర పంటల కర్రలను రోటివేటర్‌తో పొలంలో కలియదున్నాలని సూచించారు.

‘ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మోడీ ప్రభుత్వం’



మాట్లాడుతున్న గోపస్ లక్ష్మణ్

తెలకపల్లి: మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన కొనసాగిస్తుందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపస్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో అరాచక పాలన కొనసాగుతుందని, మతోన్మాదులు అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఈ నెల 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతా నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ రెండవ సారి అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేని విధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను అమాంతం పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రభుత్వాన్ని నడపాలని చూస్తున్నారని విమర్శించారు. ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్, ఉస్సేన్, మల్లయ్య, నడిపయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



వెల్దండ మండలం కొట్రలో నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొట్ర, తిమ్మినోనిపల్లి, కంటోనిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీలకు గ్రీనరీ నెట్ ఏర్పాటు చేయాలన్నారు. వేసవి సమీపిస్తుండడంతో ఎండతీవ్రతకు నర్సరీలో పెంచుతున్న మొక్కలపై పడకుండా చూడాలన్నారు. రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏ సత్యనారాయణ, కార్యదర్శి బాలస్వామి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కోడేరు: రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేసి కౌలు రైతులను ఆదుకోవాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. మండల అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు రైతు బంధు, బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ధరణి వెబ్‌సైట్‌లో రైతుల భూములు చూపడం లేదన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో బాలయ్య, నాగేంద్రం, శ్రీను, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అచ్చంపేట రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్టీసీ డీఎం రాజశేఖర్ సూచించారు. సోమవారం డిపో ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీబీఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గువ్వల అమల, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, ఉద్యోగులు పెర్ముల ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను ప్రిన్సిపాల్ మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలో మహిళలను, మహిళా కండక్టర్లను డీఎం రాజేశ్వర్, ఆర్టీసి ఉద్యోగులు సత్కరించారు. ప్రభుత్వ పీజీ కళాశాల, మహిళా సమాఖ్య కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయాల్లో మహిళా దినోత్సవం నిర్వహించారు.

మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే

కల్వకుర్తిరూరల్: వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చేతి గాయమై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంత్రిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ఆర్థికసాయం అందజేత



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌కు చెందిన గువ్వల రాములు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ రాము అతని ఆరోగ్య విషయాలు తెలుసుకుని చికిత్స నిమిత్తం రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో రాజు, సామ్‌సన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హోలీ సంబరాలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో విద్యార్థులు మంగళవారం సెలవు కావడంతో సోమవారం హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. పాఠశాల ఆవరణలో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

అచ్చంపేట రూరల్: విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ రామారావు హెచ్చరించారు. మండలంలోని లింగోటం ప్రాథమిక పాఠశాలలో ఈనెల 4న శనివారం విద్యార్థులతో పనులు చేయించారని వచ్చిన కథనానికి ఎంఈఓ స్పందించారు. సోమవారం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎవరూ పనులు చేయించారని ఆరా తీశారు. ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తామని ఎంఈఓ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

తెలకపల్లి: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యుల సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, పర్వతాలు, కృష్ణయ్య, భరణి, రామకృష్ణ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు అందలేదని ఫిర్యాదు

కల్వకుర్తిరూరల్: రైతుబంధు పథకం చాలా మంది రైతులకు అందలేదని రైతు సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, చెన్న స్వామి సోమవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 13 ఎకరాల నుంచి 15 ఎకరాల భూమి ఉన్న రైతులకు, 16 నుంచి 20 ఎకరాలు ఉన్న రైతులకు అందిన రైతుబంధు మధ్యలో ఉన్న కొంత మంది రైతులకు ఇప్పటికీ అందలేదన్నారు. వారికి రైతుబంధు నిధులు వచ్చేలా చూడాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో ద్యాప జంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మోతిలాల్‌నాయక్, శేఖర్, పర్వత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లెప్రకృతి వనం పరిశీలన

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో నాలుగు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో పల్లె ప్రకృతివనం కాలిపోయింది. సోమవారం ఎంపీడీఓ ఆంజనేయులు, సర్పంచ్ కల్పన తదితరులు పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామని ఎంపీపీ మనోహర తెలిపారు.

ఉపసర్పంచ్ మృతి



భాస్కరాచారి (ఫైల్)

చారకొండ: మండలంలోని గోకారం ఉపసర్పంచ్ భాస్కరాచారి (40) సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి గ్రామస్తులు, మండలంలోని నాయకులు సంతాపం తెలిపారు.

బలవంతంగా రంగులు చల్లరాదు

కోడేరు: మండలంలోని ప్రజలు హోలీ వేడుకలను శాంతియుతంగా చేసుకోవాలని ఎస్ఐ నరేందర్‌రెడ్డి ప్రకటనలో సూచించారు. మంగళవారం ఎవరిపైనా బలవంతంగా రంగులు చల్లరాదని, రోడ్లపై వెళ్లే వాహనదారులకు ఆటంకం కలిగించరాదని, డీజేలకు ఎలాంటి అనుమతులు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఇమ్మడి సైదులు నవోదయ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు వెంకటేష్ వాటిని విద్యార్థులకు పంపిణీచేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్‌లో విద్యార్థులకు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన నరసింహారావు 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను, పరీక్ష ప్యాడ్, పెన్నులను అందించారు.

పౌష్టికాహారంపై అవగాహన

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అశోక్ పాల్గొని మాట్లాడారు. గర్భిణులతో పాటు బాలింతలకు గుడ్లు, పాలతో పాటు ఇతర పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని అన్నారు.